వనమాలి బస్సు దిగాడు.

ఎదురుగా తాతయ్య...

వేయికళ్లతో తనరాక కోసమే నిరీక్షిస్తూ కనిపించాడు.

తాతయ్య సూట్‌కేసు కోసం చేయి చాచాడు.

వనమాలి ఒప్పుకోలేదు.

ఇద్దరూ టాపులేని రిక్షా ఎక్కారు.

“బాగున్నారా తాతయ్యా... నాన్నమ్మెలా ఉంది...” వనమాలి



రసరాజు

యోగక్షేమాలడిగాడు.

"బాగానే ఉన్నాం బాబూ..." అంటూ తాతయ్య ఏవో కబుర్లలోకి దింపబోయాడు.

"తాతయ్యా... కాసేపు ఏమీ మాట్లాడించకు... చెట్టూ చేమా చూసుకొంటూ మౌనంగా పోదాం... సాయంత్రం నీ దగ్గరే కూర్చుంటాగా... అప్పుడన్నీ చెపుదువుగాని?..."

"ఇంకా చెట్టూ చేమా ఎక్కడివిరా... పన్నెండేళ్ల క్రితం పల్లెటూరనుకొంటున్నావా... ఆ పల్లెతల్లి ఎప్పుడో..." అంటూ తాతయ్య ఏదో చెప్పబోయాడు.

వనమాలి "కాసేపు ఆగు తాతయ్యా..." అంటూ గడ్డం పట్టుకొన్నాడు.

కొంతదూరం సాగేసరికి వనమాలికి అన్నీ అనుభవంలోకి రాసాగాయి.

అసలు - ఆ వాతావరణమే మారిపోయింది.

సహనంతో రాళ్లదెబ్బలు తింటూ మధురంగా నవ్వే ఆ మామిడి చెట్టు కోసం అటూ యిటూ చూశాడు.

అది హుష్‌కాకి అయిపోయింది...

పండిన వరిచేల మధ్య ఎర్రటి తామర పూలతో కనిపించే ముత్తయిదువలాంటి ఆ చెరువు కూడా అదృశ్యమైపోయింది.

రోడ్డుకి అటూ యిటూ చూశాడు.

పక్షులు కొరికి పడేసిన బాదంకాయలు కనిపించటం లేదు...

కోతి కొమ్మచ్చిలాడటానికి వంపు తిరిగిన అలనాటి చెట్టు కొమ్మలు సైతం చూపులకు అందటం లేదు.

వర్షం వస్తే తలదాచుకోటానికి ఆ పాడుపడ్డ సత్రం కూడా కనుమరుగైపోయింది.

చీదరించుకొనే మట్టిరోడ్డు స్థానంలో సిమెంట్‌రోడ్డు కొత్త రూపందాల్చి బద్ధకంగా ఒళ్లు విరుచుకొంటోంది...

వనమాలిలో ఆవేదన - ఆనందం - ఒకదాని వెంబడి ఒకటి ఆవహించాయి.

గతకాలం దృశ్యాలపై ఒక ఇనుప తెర పడిపోయింది. ఆ అనుభవాల్ని తలచుకొంటూ నిట్టూర్చాడు...

నేటి కాలం అభివృద్ధి దిశగా పరుగులు తీస్తోంది. మంచి పరిణామం... ఈ అనుభూతుల్ని ఆస్వాదిస్తూ అభ్యుదయవాదిగా ఆనందించాడు.

"కాలం నాణెం లాంటిది... దానికి రెండు పార్శ్వాలు..." ఎప్పుడో తను వ్రాసిన కథలోని ఒక వాక్యం గుర్తుకొచ్చింది.

"ఊళ్లోకి వచ్చేశాం..." తాతయ్య మనవడి భుజంపై చేయివేస్తూ అన్నాడు.

అప్పుడు గాని వనమాలి వర్తమానంలోకి రాలేదు.

"ఏ బాబూ... రాఘవయ్యగారి విగ్రహం దగ్గర ఒక నిమిషం ఆపుచెయ్..." వనమాలి అన్నాడు.

రిక్షా అక్కడ ఆగింది.

తాతయ్యకు ఇదేమీ అర్థంకాలేదు.

"తాతయ్యా... ఒక్క నిమిషం..." అంటూ బేగ్‌లోంచి ఓ దండ తీశాడు.

"ఎందుకురా..." తాతయ్య అసహనంతో మూలిగాడు.

తాతయ్య చూస్తూండగానే వనమాలి ఆ విగ్రహానికి దండ వేసి వచ్చి రిక్షాలో కూర్చున్నాడు.

తాతయ్య వనమాలి చేసిన పనిని సమర్థించలేకపోయాడు.

మనవడికేసి అదోలా చూసి తలదించు కొన్నాడు.

"వాడికి దండేవిట్రా... మన ప్రత్యర్థి..." తాతయ్య మండిపడ్డాడు.

వనమాలి ఏమీ మాట్లాడలేదు...

ఆ ఊరు గురించి, ప్రజల గురించీ విన్నాడు. తాత, తండ్రీ కలిసి రాఘవయ్యగారి మంచి పనులకు ఎలా అడ్డు పుల్లలు వేసిందీ - అన్నీ మిత్రుడు సంపత్ ద్వారా ఎప్పుడో తెలుసు కొన్నాడు వనమాలి.

రిక్షా వెళ్లి ఒక ఇంటి ముందాగింది.

అదే తాతయ్య ఇల్లు.

ఆ సాయంకాలం -

తాతయ్య తోడులేకుండానే వనమాలి ఒక్కడే ఊళ్లోకి బయల్దేరాడు. దారిలో గుర్తులో ఉన్న పెద్దవాళ్లందర్నీ వనమాలి చేతులు జోడిస్తూ పలకరించాడు.

"గంజాయి వనంలో తులసిమొక్క..." వనమాలి తీరుతెన్నుల్ని గమనించిన వాళ్లు అను కొన్నారు.

"ఎంతగా మారిపోయిందో ఊరు..." అడుగడుగునా వనమాలికి ఆశ్చర్యమే ఎదు రయింది.

ఊళ్లో మచ్చుకైనా ఎక్కడా పూరిగుడిసె కనిపించటం లేదు.

డాబాలూ, భవనాలు కొలువుతీరి "కో" అని పిలుస్తున్నాయి.

పన్నెండేళ్లలో ఇంత మార్పా...

వనమాలి నమ్మలేకపోయాడు...

అక్కడక్కడా షాపులు...

పద్ధతిగా రూపొందించిన రోడ్లు...

మంచినీటి కుళాయిలు...

డ్రయినేజ్ సౌకర్యం...

ఓహ్! ఒకటేమిటి?... వనమాలికి ప్రతీదీ వింతగానే తోచింది. పుట్టి పెరిగిన ఊళ్లో - ఇంత అభివృద్ధి కనిపించేసరికి వనమాలి ఎంత గానో ఉప్పొంగిపోయాడు.

కొంతదూరం వెళ్లాక - వనమాలి ఓ గుడి ముందాగాడు.

గ్రామీణుల సహకారంతో ఆ గుడిని ఎలా తీర్చిదిద్దారో అక్కడున్న ఒక యువకుడు వివరి స్తూంటే వనమాలి విస్తుపోయాడు.

ఒకప్పుడు తనకు బాగా తెలిసిన దేవాలయమే అది. అయితే మారిపోయిన రూపురేఖల మధ్య వనమాలి దాన్ని గుర్తించలేకపోయాడు.

వేణుగోపాలస్వామి గుడిలో అర్చన చేయించి నాలుగడుగులు ముందుకేశాడు. మునసబు గారింటి ముందు వెలసిన కళ్యాణమంటపం వనమాలిని బాగా ఆకర్షించింది. వివాహాలు మొదలుకొని విద్వత్సభల వరకూ అదే వేదిక కావడం వనమాలిని అమితంగా ఆకట్టుకొంది.

మరికొంత దూరం సాగాడు.

గ్రంథాలయం పలుకరించింది. లోపలికెళ్లి చదువరుల జాబితాలో సగర్వంగా తెలుగులో సంతకంచేసి అక్కడున్న పుస్తకాల్ని చూసి బయటకొచ్చాడు. దానికి పదిగజాల దూరంలో పాలకేంద్రం కనిపించింది.

అది దాటి మలుపు తిరిగితే - పశుగణాభివృద్ధి నిలయం...

ఆ వెనుక వీధిలో హైస్కూల్...

ఆ ప్రక్కనే కో-ఆపరేటివ్ సొసైటీ...

పురాణం పంతులుగారి రావిచెట్టుదాటి కొంచెం ముందుకు నడిస్తే హాస్పటల్...

ఎదురుగా పోస్టాఫీస్... అక్కడే బ్యాంక్...

ఊరికి మధ్యలో బస్టాప్... ఊళ్లోకి బైపాస్

సర్వీసులు మాత్రమే రావు.

అందుకే తాతయ్యకు ముందుగానే కబురు పెట్టి ఊరవతల రోడ్డు మీద బైపాస్ ఎక్స్‌ప్రెస్‌లో దిగాడు వనమాలి.

ఒక్కొక్కటీ పరిశీలిస్తూ పార్కులోకి అడుగు పెట్టాడు వనమాలి.

అదొక నందనవనంలా అగుపించింది. చాలాసేపు అక్కడే గడిపి ఇంటి ముఖం పట్టాడు వనమాలి.

ఆ ఊరి ప్రగతి గురించి, రాఘవయ్యగారు పడ్డ శ్రమ గురించీ వాళ్లూ వీళ్లూ చెపుతూంటే వనమాలి అక్షరం పొల్లుపోకుండా ఆసక్తిగా ఆ విషయాలన్నిటినీ ఆలకించాడు.

ఆ ఊళ్లో మూడు వందల ఇళ్లున్నాయి.

జనాభా రెండు వేలు...

అందులో సగానికి సగం వనమాలి కుటుంబం మాదిరి దండిగా డబ్బున్నవాళ్లే... వాళ్లందరూ కలిసి ఎవరి పరిధిలో వాళ్లు కొంత సొమ్ము పెట్టుబడి పెట్టడంతో ఆ ఊరి కథే మారిపోయింది. ఆ పెట్టుబడి ఆధారంగా వివిధ వాణిజ్య కేంద్రాలు నెలకొల్పబడ్డాయి. ఆ ఊళ్లో ప్రజలందరూ ఆ షాపుల్లోనే కొనాలన్నది ఆ గ్రామ శాసనం. నాణ్యత, ధరల విషయంలో ఏ విమర్శకీ తావులేదక్కడ. పట్టణాలతో సమానంగా ప్రతి కొత్త ఉత్పత్తినీ ఆ షాపులు దిగుమతి చేసుకొంటున్నాయి. దొరకని వస్తువంటూ లేదు. లాభాల్ని పెట్టుబడుల నిష్పత్తిలో పంచుకొంటూ - అందులో కొంత శాతాన్ని గ్రామాభివృద్ధినిధిగా కూడబెడుతున్నారు. ఈ వ్యవహారాలన్నీ చూడడానికి ఊరిమధ్యలో ఒక కార్యాలయం ఉంది. పెట్టుబడి పెట్టే తాహతు లేని అట్టడుగు వర్గంలో కొంతమందికి ఆ షాపుల్లో పనికల్పించబడింది. స్త్రీలు కుట్టుపని, లేసు అల్లటం వంటి పనులలో తర్ఫీదు పొందారు.

అయితే ఇంతటి అభ్యుదయ చరిత్ర వెనుక రాఘవయ్య అనే ఒక మహనీయుడు దాగి ఉన్నాడన్న సత్యాన్ని తెలుసుకొన్న వనమాలి ఆయనకు అంజలి ఘటించకుండా ఉండలేకపోయాడు. తన ఆస్తిలో ఎక్కువ భాగాన్ని గ్రామాభివృద్ధి కోసం ఉదారంగా ధారపోసిన త్యాగశీలి ఆయన. కష్టాల్ని సైతం లెక్కపెట్ట కుండా గ్రామంకోసం ఖర్చుపెట్టిన ఒక మహా మనీషి ఆయన. ఈ అభివృద్ధికి సంబంధించిన ప్రతి ప్రణాళికా రచనలోనూ ఆయనదే శ్రీకారం. ప్రభుత్వం నుంచి మేచింగ్ గ్రాంట్స్ సంపాదించడంలో ఆయన అడుగడుగునా కృతకృత్యు లయ్యారు. తన ప్రయాణమార్గంలో కొన్ని అడ్డుపుల్లలు వెక్కిరించినా ఆయన నవ్వుకొంటూనే ముందుకు సాగిపోయారు. తన తాత గారూ, తండ్రీ ఒక వర్గాన్ని కూడకట్టుకొని తిరుగుబాటు ఎగరేసినా ఆ నీడలోంచే ఆయన పురోగమించాడు. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ గ్రామ చైతన్యానికి ఊపిరిపోసింది రాఘ వయ్యగారే!

అడుగులో అడుగు వేసుకొంటూ ఆ గ్రామ చరిత్రనంతటినీ ఆనోటా ఈనోటా విన్న వనమాలికి కాళోజీ వ్రాసిన మినీకవిత గుర్తు కొచ్చింది.

"పుటుక నీది
చావు నీది
బతుకంతా దేశానిది..."

జయప్రకాశ్ నారాయణ్ పరమపదించినప్పుడు కాళోజీ చెప్పిన మినీకవిత ఇది.

రెండు చేతులూ జోడించి మనసులోనే ఆ మహావ్యక్తికి నమస్కరించాడు వనమాలి.

ఉప్పొంగిన ఆనందంతో క్షణకాలం ఉక్కిరిబిక్కిరయ్యాడు. గ్రామ వైభవం తిలకించి ఇంటిలో అడుగుపెట్టేసరికి రాత్రి ఏడుగంటలయింది. సరిగ్గా అప్పుడే హైదరాబాద్ నుంచి

వనమాలి తలిదండ్రులూ, భార్య, మూణ్ణెల్ల కొడుకు వచ్చారు.

ఆ రాత్రి -

ఎంత ప్రయత్నించినా వనమాలికి నిద్ర పట్టలేదు.

ఉదయమే లేవాలి.

అమెరికా నుంచి పదిరోజుల క్రితమే వనమాలి హైదరాబాద్ వచ్చాడు. హైదరాబాద్‌లో తల్లీతండ్రీ ఉంటున్నారు. నిన్న ఉదయం హనుమకొండ వెళ్లి, అక్కడనుంచి నేరుగా ఈ ఊరొచ్చాడు.

తాతయ్య కోరిక మేరకు తన కొడుక్కి నామకరణ మహోత్సవం రేపిక్కడ జరిపించాలి.

నిద్రపట్టక వనమాలి ప్రక్కనే ఉన్న మేగజైన్ తీసుకొని చదవడం మొదలుపెట్టాడు.

ఒంటిగంట దాటిపోయింది.

అయినా కంటికి కునుకు రావడం లేదు.

అతని ఆలోచనంతా తాను పుట్టి పెరిగిన ఈ ఊరు గురించే. ఇంతగా అభివృద్ధి సాధించడం వెనుక రాఘవయ్యగారి కృషి తనను ఎంతగానో ప్రభావితం చేసింది.

ఆ ప్రక్కనే తండ్రి, తాత కలసి స్వార్థంతో ఆయనపై తిరగబడ్డ చరిత్రా మనసులో మెదిలింది.

అమెరికాలో ఉన్నప్పుడు ఈ ఊరు అభివృద్ధి గురించి స్నేహితుల ద్వారా విన్నాడు కాని, ఇంత వైభవం ఉంటుందనుకోలేదు.

అమెరికా వెళ్లాక "మా పల్లె బంగారం" అంటూ ఎలుగెత్తి చాటాలనిపించింది. ఆ నిమిషంలో రాఘవయ్యగారు నవభారత గ్రామ నిర్మాతగా కనిపించారు.

ఆ మరుసటిరోజు సాయంత్రం గుడి బయట "నామకరణం" పై చర్చ మొదలయింది.

అక్కడిద్దరు కూర్చున్నారు.

"పిల్లాడికి తాతగారిపేరు పెడతాడేమో వనమాలి..."

"తండ్రిపేరు వదిలేశా..."

ఇంతలో అక్కడికి మరో వ్యక్తి వచ్చాడు. చర్చ ఏమిటో అతనికి అప్పటికే అర్థమయింది.

"మీరనుకొన్నట్లు ఆ పేర్లేమీ పెట్టలేదు. ఆఖరికి మనం కూడా తలకాయలు దించుకొనేలా కొడుక్కి పేరు పెట్టాడ్రా..." ఆ వ్యక్తి అన్నాడు.

"అవును మరి... అమెరికాలో ఉంటున్నాడు కదా... ఏ క్లింటన్ పేరో, బుష్ పేరో తగిలించుంటాడు... ఆ ఉప్పు తింటున్నాడుగా మరి..."

అదిగో అక్కడే పప్పులో కాలేశారు... మన పిల్లలెవ్వరికీ మనం కృతజ్ఞతగా పెట్టనిపేరు ఆ అమెరికా కుర్రాడు పెట్టాడోయ్... దానికే సిగ్గుపడాలి మనమంతా..."

"ఇంతకీ ఏమిటా పేరు?..."

"రాఘవ్..."

●

> ### మరపురాని 'రోజు'
>
> ఓ మహాతల్లికి భర్తని సాధించడం డ్యూటీ. ఒక రోజు ఆమె సాధింపు ఇలా వెరైటీగా ఉంది.
>
> భార్య: "హు! ఏదీ గుర్తుండి చావదు మీకు! అన్నీ నేనే చెప్పాలి! అసలీ రోజు మన పెళ్ళి రోజునైనా మీకు గుర్తుందా?"
>
> భర్త: "ఎంత మాట! నా జీవితంలో మధురాను 'బూతు'లను మిగిల్చిన ఈరోజునెలా మార్చిపోతాననుకొన్నావ్?"
>
> భార్య: ???